RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి


తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

సంపుటి - 01 సంచిక - 302 పేజీలు - 05 వెల - 05/- ఎడిటర్ : సి యం శ్రీనివాస్ బుధవారం 10 జులై 2024




# వాస్తవాలు తెలిపేందుకే శ్వేతపత్రం

**-విద్యుత్ రంగంపై శ్వేత పత్రం విడుదల చేసిన సీఎం నారా చంద్రబాబు నాయుడు.**

-విద్యుత్ రంగంపై 1,29,503 కోట్ల నష్టం.

ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణల వల్ల 2004లో తాను అధికారం కోల్పోయినా దేశం బాగుపడింది.

-వైఎస్సార్సీపీ ఐదేళ్ల కాలం లో విద్యుత్ రంగం పూర్తిగా నాశనమైంది.


**ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 09:**

“ప్రజలు గెలవాలి, రాష్ట్రం నిలబడాలని పిలుపునిచ్చాం.. ప్రజలు గెలిచి మమ్మల్ని గొప్ప స్థానంలో నిలబెట్టారు. కానీ, అన్ని శాఖల్లో భయంకరమైన పరిస్థితులు ఉన్నాయి. అందుకే శ్వేతపత్రాల ద్వారా ప్రజలందరికీ వాస్తవాలు చెబుతున్నాం.. సమర్థమైన పాలన వల్లే పేదలకు మెరుగైన ప్రయోజనాలు అందుతాయని, బాధ్యత లేని పరిపాలన వల్ల అనేక కష్టాలు ఎదురవుతాయి” చంద్రబాబు అన్నారు. డిజిటల్ కరెన్సీని ప్రోత్సహించాలని బ్యాంకర్లకు చెప్పామన్న చంద్రబాబు రూ.500, 200 నోట్లు కూడా రద్దు చేయాలని కోరుతున్నాం అని అన్నారు. వైఎస్సార్సీపీ పాలనలో రాష్ట్ర భవిష్యత్ ను దారుణంగా దెబ్బ తీశారని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగైన పాలన ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యం అవుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని పలు అంశాలు పరిశీలిస్తే చాలా ఇబ్బందికరంగా ఉన్నాయని, ఏ అంశాలు ఎలా ధ్వంసం అయ్యాయో తవ్వే కొద్ది వెలుగు చూస్తున్నాయని ధ్వజమెత్తారు. అన్ని శాఖల్లోనూ ఇదే పరిస్థితి ఉందని మండిపడ్డారు. అందుకే రాష్ట్రానికి బాధ్యతా యుతమైన నాయకుడు ఉండాలి.. దీనిపై ఆలోచించమని ప్రజలకు చెబుతున్నామన్నారు. విద్యుత్ రంగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా రిమోట్ మొరాయించడంపై చంద్రబాబు ఛలోక్తులు విసిరారు. పనిచేయకపోవడం వైఎస్సార్సీపీ ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిందని, సరి చూసుకోవాలని అధికారులకు చురకలు వేశారు.

మిగతా 2లో

## జోగి రమేష్ ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా.!

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 09:
2021లో చంద్రబాబు నాయుడు ఇంటిపై దాడి వ్యవహారంలో తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.గత ఐదేళ్లూ జగన్ మోహన్ రెడ్డి అధికార అండతో అరాచకాలకు తెగబడిన వైఎస్సార్సీపీ నేతలు ఇప్పుడు కేసుల భయంతో కోర్టుల నుంచి శరణు కోరుతున్నారు. ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వరుసపెట్టి న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు.




2021లో ఉండవల్లిలోని నారా చంద్రబాబు నాయుడు ఇంటిపై మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన అనుచరులు రాళ్లతో దాడి చేశారు. ఈ వ్యవహారంలో తాడేపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటీషన్? వేశారు. జోగి పిటీషన్?పై హైకోర్ట్ విచారణ జరిపింది.

ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులకు హైకోర్ట్ ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను న్యాయస్థానం ఈ నెల 10కి వాయిదా వేసింది. 2021లో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎంగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు ఇంటిపై జోగి రమేష్ రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనపై 143, 324, 506, 188, 269, 270, రెడ్ విత్ 149 ఐపీసీ సెక్షన్లతో తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

## వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ.!

**-అరెస్టు నుంచి తాత్కాలిక రక్షణ కల్పించేందుకు నిరాకరణ.**

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 09:
మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంపై మూకుమ్మడి దాడి కేసులో అరెస్టు నుంచి తాత్కాలిక రక్షణ కల్పించాలని కోరుతూ వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. పూర్తి వివరాలు సమర్పించేందుకు సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది (జీపీ) కేఎం కృష్ణారెడ్డి కోరడంతో విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్కే కృపాసాగర్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్రెడ్డి వాదనలు వినిపించారు. మూడేళ్ల కిందట నమోదైన కేసును తెరపైకి తెచ్చి అరెస్టులు చేస్తున్నారన్నారు. పిటిషనర్ కు అరెస్టు నుంచి తాత్కాలిక రక్షణ కల్పించాలని కోరారు. పోలీసుల తరఫున జీపీ కృష్ణారెడ్డి వాదనలు వినిపించారు. తెదేపా పార్టీ కార్యాలయంపై 2021లో వైకాపా నేతల కనుసన్నల్లో మూకుమ్మడి దాడి చేశారన్నారు. అప్పట్లో కేసు నమోదు చేసినా.. దర్యాప్తులో పురోగతి లేదన్నారు. ప్రస్తుతం దర్యాప్తు మొదలు పెట్టేసరికి బెయిలు కోసం హైకోర్టును ఆశ్రయిస్తున్నారన్నారు. అరెస్టు నుంచి రక్షణ ఇవ్వొద్దని కోరారు.

## ఏపీలో ఈనెల16న కేబినెట్ సమావేశం.!



ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 09:
ఈనెల 16వ తేదీన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం జరగనుంది. ఉదయం 11 గంటలకు సెక్రటేరియట్‌లోని ఫస్ట్ బ్లాక్‌లో రాష్ట్ర మంత్రివర్గం భేటీ కానుంది. ప్రభుత్వం అమలు చేసే పథకాలు, ఎన్నికల హామీలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా భేటీలో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేబినెట్ సమావేశంలో చర్చించే అంశాలను ఈ నెల 11న సాయంత్రం 4 గంటల లోపు శాఖలవారీగా అందజేయాలని అధికారులను ఆదేశించింది ప్రభుత్వం. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహా ఇతర మంత్రులు పాల్గొననున్నారు.

## కిడ్నీ రాకెట్ వార్తలపై హోంమంత్రి అనిత ఆగ్రహం.!

**- హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశం.**
**-గుంటూరు కలెక్టర్, ఎస్పీ, విజయవాడ పోలీస్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్లతో మంత్రి ఫోన్లో అనిత**

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 09:
విజయవాడలో కిడ్నీ రాకెట్?పై మీడియాలో వస్తున్న వార్తలకు స్పందించిన హోం మంత్రి అనిత, అధికారులను ఆరా తీశారు. గుంటూరు కలెక్టర్, గుంటూరు ఎస్పీ, విజయవాడ పోలీస్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్?తో మంత్రి అనిత ఫోన్లో మాట్లాడారు. డబ్బులు ఆశ చూపి కిడ్నీ కొట్టేసిన ఆసుపత్రిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఇటువంటి ఘటనలపై పోలీసులు నిఘా పెట్టాలని ఆదేశించారు. హోంమంత్రి ఆదేశాలతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేపట్టారు. కిడ్నీ రాకెట్‌లో మోసపోయిన మధుబాబును పోలీసులు విచారిస్తున్నారు. గుంటూరు నగరంపాలెం అధికారులు లోతుగా విచారణ మొదలు పెట్టారు. ఇప్పటికే పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విజయవాడలో కిడ్నీ రాకెట్ మోసాలు వెలుగు చూశాయి. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ కోసం కిడ్నీ అమ్మేందుకు ఒప్పుకున్నాడు. అయితే కిడ్నీ తీసుకుని తనను



మోసం చేశారని గుంటూరుకు చెందిన గార్లపాటి మధుబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిడ్నీ ఇస్తే డబ్బులు ఇస్తామని చెప్పి విజయవాడలోని ఓ ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారని తెలిపారు. అయితే ఆపరేషన్ పూర్తయ్యాక కేవలం లక్షా పదివేలు ఇచ్చారని వాపోయారు. మిగిలిన డబ్బులు ఇవ్వాలని అడిగితే తనను బెదిరిస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. తనలాగే డబ్బు ఆశ చూపి నెలకు ఐదు నుంచి 10 మందికి కిడ్నీ ఆపరేషన్లు చేస్తున్నారని బాధితుడు ఆరోపించారు.

మిగతా 2లో

## పాలిసెట్ - 2024 నోటిఫికేషన్ విడుదల.!

**-సాంకేతిక విద్యా శాఖ సంచాలకురాలు డాక్టర్ నవ్య.**

ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 09:
రాష్ట్రంలోని పాలిటెక్నిక్ ప్రవేశాలకోసం తుది దశ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సాంకేతిక విద్యా శాఖ సంచాలకురాలు డాక్టర్ బి నవ్య తెలిపారు.




ఏపీ పాలిసెట్ - 2024లో అర్హత పొంది డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకోవలసి ఉంది. ఆన్‌లైన్ పద్ధతిలో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికేట్ ధృవీకరణ, ఎంపికల నమోదు ప్రక్రియల కోసం జూలై 11 నుండి 14 వరకు సమయం కేటాయించామన్నారు. జూలై 16న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. సంపూర్ణ వివరాలు, షెడ్యూల్ కోసం %హ్ట్ట్ప్స్://ఫొలయ్చెత్.అప్.గొవ్.ఇన్% వెబ్‌సైట్‌లోని వివరణాత్మక నోటిఫికేషన్ పరిశీలించాలని డాక్టర్ నవ్య స్పష్టం చేశారు. సెల్ఫ్ జాయినింగ్ , రిపోర్టింగ్ కోసం జూలై 18 నుండి 20 వరకు అవకాశం ఉంటుందని, ఇప్పటికే క్లాసులు ప్రారంభం అయ్యాయని వివరించారు.

# రైతు నష్టపోకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోండి

**-నకిలీ విత్తనాలను అరికట్టి నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయండి. -వ్యవసాయ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 09:**

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఇబ్బంది లేకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయడంతో పాటు నకిలీ విత్తనాల అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రగతిపై సంబంధిత అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాల బెడద అధికంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు రైతులకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై సకాలంలో పంపిణీ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అలాగే రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులకు కూడా కొరతలేదని రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో రైతులకు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో దాదాపు 3 లక్షల మంది రైతులు ఉన్నారని అందులో 30 శాతం మంది కౌలు రైతులు ఉన్నట్లు చెబుతున్నారని వీరందరికీ పంట రుణాలు ఇప్పించడంలో ప్రత్యేక చొరవ చూపాలని వ్యవసాయ అధికారులను ఆమె ఆదేశించారు. ఇన్పుట్ సబ్సిడీ, పీఎం కిసాన్ కింద పెండింగ్ లో ఉన్న బకాయిలను చెల్లింపుకు ఉన్న సాంకేతిక అడ్డం కులం తొలగించి చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. జూలై మాసంలో అత్యల్ప వర్షపాతం నమోదైనందున ఆగస్టు చివరి వరకు సాగు చేసుకునే అవకాశం ఉందని.... ఈలోగా రైతులకు అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన కల్పించి విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలన్నారు. నకిలీ సీడ్స్ ఉత్పత్తులు, సరఫరాపై విస్తృత దాడులు నిర్వహించి సంబంధిత విక్రయదారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉద్యాన పంటల కింద 40 వేల హెక్టార్లలో సాగుతున్న పండ్ల తోటల పెంపకాన్ని మరింత విస్తృత పరిచేందుకు అవకాశం ఉందని ఈ మేరకు రైతులను



ప్రోత్సహించి చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలోనీ భూములు వినూత్న పంటల ఉత్పత్తులకు అపార అవకాశాలు ఉన్నాయని 90 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పండ్ల తోటల ఉత్పత్తికి అవకాశం ఉందని ఉద్యాన పంటల వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. ఆయిల్ ఫామ్ సాగుతో పాటు ఇతర ఉద్యాన పంట ఉత్పత్తుల దిగుబడులకు కూడా పైమార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలో పశు సంపద ప్రోత్సహించి పాడి పారిశ్రమాభివృద్ధికి చర్యలు తీసుకోవడంతోపాటు, క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టాలన్నారు. 400 ఎకరాలలో సాగుతున్న పట్టు పరిశ్రమ అభివృద్ధికి కూడా చర్యలు తీసుకోవాలని డిడి సెరికల్చర్ ను ఆదేశించారు. కృష్ణా, కుందూ నది పరీవాహక ప్రాంతాలలోని రిజర్వాయర్లో చేపల ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో చేపల ఉత్పత్తికి అవకాశం ఉన్నప్పటికీ వినియోగం తక్కువగా ఉందని సీడ్ ప్రొడక్షన్, సొసైటీలను పటిష్టం చేసి మత్స్య సంపద పెంపుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, 124 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా నీటి లభ్యతను బట్టి సాగునీరు అందించే విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ అందుకు అనుగుణంగా పంటలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణమూర్తి, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, ఏపిఎంఐపి పిడి సత్యనారాయణ, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరమణ, మత్స్యశాఖ అధికారి రాఘవరెడ్డి, భూగర్భ జల శాఖ ఏడి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య లోపాన్ని నివారించండి.

**-స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయండి.**

**-అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 09:

రాష్ట్రవ్యాప్తంగా డయారియా కేసులు నమోదు అయితున్న నేపథ్యంలో గ్రామాలు, పట్టణ ప్రాంతాలలో ఎక్కడా పారిశుధ్యం లోపం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో త్రాగునీటి సదుపాయం, పారిశుధ్య లోపాలపై ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సాధారణంగా త్రాగునీటి కలుషితం వల్లే డయేరియా కేసులు నమోదయ్యే ప్రమాదం వుందని... గ్రామాలు, పట్టణ ప్రాంతాలలో ఎక్కడా పారిశుధ్య లోపాలు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలోని ఓఆర్హెచ్ఎస్, పిడబ్ల్యుడి స్కీముల ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయడంతో పాటు సంబంధిత తేదీలను బోర్డులపై ప్రదర్శించాలన్నారు. తన ఆకస్మిక పర్యటనలో తప్పక పర్యవేక్షిస్తానన్నారు. వర్షాకాలంలో మురికి కాలువల శుభ్రం తో పాటు చెత్తకుప్పలు ఉండడం వల్ల దోమలు పెరిగే అవకాశం ఉందని ఎప్పటికప్పుడు చెత్తను డంపింగ్ యార్డులలు



తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలోని పంచాయతీ సెక్రటరీలు, ఈవోపీఆర్డీలు బాధ్యతాయుతంగా ఉండి పారిశుధ్య చర్యలను ముమ్మరంగా చేపట్టాలన్నారు. గ్రామాలలో శిథిలావస్థలో ఉన్న ఓ ఆర్ హెచ్ ఎస్, ఇతర నీటి వనరుల మరమ్మత్తులకు సంబంధించి ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు ఇవ్వాలని ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో అభివృద్ధికి సంబంధించి అనేక అంశాలు ఉంటాయని వాటిని పరిష్కరించడంతోపాటు ప్రధాన అంశాలను తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వర్తమాన కాలంలో నీటి సమస్య లేదని పబ్లిక్ హెల్త్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈలు కలెక్టర్ కు నివేదించారు. జిల్లాలో రెండు సమగ్ర రక్షిత నీటి పథకాలు మినహా, మిగిలిన 27 సిపిడబ్ల్యూఎస్ స్కీములు పనిచేస్తున్నాయని ప్రస్తుతానికి త్రాగునీటి సమస్య లేదని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ వివరించారు. క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేసి పైపులైను లీకేజీలు, మరమ్మత్తులు గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఏఐఐబి స్కీం కింద ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు ప్రాంతాలలో మంజూరు అయిన మూడు ప్రాజెక్టులలో పనులు మొదలై 15 శాతం పూర్తి అయ్యి మధ్యలో ఆగిపోయాయని పునరుద్ధరణ కొరకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. జలజీవన్ మిషన్, అమృత్ స్కీముల కింద పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.


# రైతు బజార్లలో కంది పప్పు, బియ్యం కౌంటర్లు ఏర్పాటు చేయండి

**-ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయాలు జరపండి. -జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 09:**

నిత్యావసర సరుకులైన కంది పప్పు, బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్ధేశించిన ధరలకే విక్రయాలు జరపాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక రైస్ మిల్లర్లు, దాల్మిర్లలతో ధరల పెరుగుదలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిత్యావసర సరుకులు ధరల పెరుగుదల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడకుండా సరసమైన ధరలకే రైతు బజార్లలో కంది పప్పు, బియ్యం కౌంటర్లు ఏర్పాటు చేసి విక్రయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బియ్యం, కందిపప్పు ధరలు మార్కెట్ రేటు కన్నా తక్కువ ధరలకు అమ్మాలని మిల్లర్లను



సూచించారు. సూపర్ మార్కెట్ల నందు మరియు రైతు బజార్లలో స్పెషల్ కౌంటర్లు ప్రారంభించాలని ఆయన తెలిపారు. ప్రతి ఒక్క కౌంటర్ ముందు తప్పనిసరిగా ధరలతో కూడిన బ్యానర్ ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. జిల్లాలో మొత్తం ఐదు కౌంటర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను సూచించారు. పట్టణంలోని శ్రీనివాస నగర్ రైతు బజార్ నందు, టెక్కె మార్కెట్ యార్డ్, ఆళ్లగడ్డ ఆత్మకూర్ మరియు డోన్ మండలం నందు గల మార్కెట్ యార్డులలో కౌంటర్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లైస్ అధికారులను ఆదేశించారు. కౌంటర్లలో వస్తువుల యొక్క నాణ్యత తగ్గకుండా చూడాలని, నిత్యవసర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ధరలను కంట్రోల్ చేసే ప్రయత్నంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతుందని ఆయన వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం జిల్లాలోని రైతు బజార్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్ల నందు మరియు సూపర్ మార్కెట్ల నందు కందిపప్పు- 160 రూపాయలు, సోనామసూరి ఫైన్ రైస్-49 రూపాయలు, సోనామసూరి ఫైన్ రైస్ 48 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రత్యేక కౌంటర్లు గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభించబడుతుందని ఆయన తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మరియు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు వినియోగదారులకు అందుబాటులో ఉంతాయని ఆయన తెలిపారు. జిల్లాలోని వినియోగదారులు తమ ఆధార్ కార్డు తో పాటు క్యారీ బ్యాగులు తీసుకొని కొనుగోలు చేసుకోవలసిందిగా ఆయన సూచించారు. ధరల నియంత్రణకు ప్రతివారం మిల్లర్లు హోల్ సేల్ డీలర్లతో సమావేశం నిర్వహిస్తానని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్లు, దాల్ మిల్లర్లు, సివిల్ సప్లై అధికారి వెంకట్రాముడు, ఏఎస్ఓ రవిబాబు, ఎస్టేట్ అధికారి సురేష్, సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరు గ్రామంలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు

ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు జూలై 09:

ఈ దేశంలో పుట్టిన ఎందరో మహనీయులు రామనామాన్ని పట్టుకుని తరించారని అటువంటి తారక మంత్రం నాడు నేడు ఎల్లవేళలా జీవులకు బవబంధాల నుండి విముక్తిని ప్రసాదిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి



దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నందికొట్కూరు మండలం, అల్లూరు గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేసిన సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. భగవద్గీత ప్రచారకులు వి.నాగేశ్వర రెడ్డి భక్తి తత్వాన్ని గురించి చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో కె.సి. నాగలక్ష్మయ్య, అర్చకులు డి.చంద్రశేఖర్, జి.జయరామి రెడ్డి, యం. రత్నాకర్ రెడ్డి, జి.లక్ష్మీదేవమ్మ, వి.లక్ష్మన్న, కె.పి.నాగలక్ష్మయ్య, జి విష్ణు నాయుడు, జి.చిన్నపుల్లన్న, జి. వెంకటేశ్వర్లు, బి. వెంకటరమణ, జి. మద్దిలేటి, యం. లక్ష్మీరెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఖనిజ సంపదను పరిరక్షించండి.

**-జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 09:

జిల్లాలో అపార ఖనిజ సంపద ఉందని... అక్రమ రవాణా పాల్పడకుండా నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని గనుల శాఖ ఏడిని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు మంగళవారం కలెక్టర్ చాంబర్లో గనుల శాఖ ప్రగతిపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి సమీక్ష



నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో లైమ్ స్టోన్, ఐరన్ ఓర్, డోలమైట్, నాపరాయి తదితర 15 రకాల ఖనిజ నిలువలు అపారంగా ఉన్నాయని... వీటి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో రాంకో, అల్ట్రాటెక్, పాణ్యం, జిందాల్, జయ జ్యోతి, రైన్ సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయని గనుల శాఖ ఏడి కలెక్టర్ కు నివేదించారు, అలాగే జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ కింద 365 కోట్ల రెవెన్యూ లక్ష్యాన్ని నిర్దేశించారని ఇందుకు సంబంధించి 280 కోట్లు లక్ష్యాన్ని సాధించామని కలెక్టర్ కు నివేదించారు. కొలిమిగుండ్ల, బేతంచెర్ల, డోన్ చెక్ పోస్ట్ లలో అక్రమ మైనింగ్ రవాణా చేస్తున్న వ్యక్తుల నుండి 50 లక్షల రూపాయల అపరాధ రుసుము వసూలు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తుందని, జిల్లాలో ఇసుక నిల్వలు స్టాక్ పాయింట్లు లేని కారణంగా సమీప జిల్లాలైన కర్నూలు, కడప, అనంతపూర్ జిల్లాల నుండి ఇసుక రవాణా చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గనుల శాఖ ఎడి రామచంద్ర పాల్గొన్నారు.

# టీడీపీ ఆఫీసుపై దాడి కేసు... ముందస్తు బెయిల్ కోరుతూ సజ్జల పిటిషన్!

**జూలై 9అమరావతి ఆంధ్ర ప్రగతి:**



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరగడం తెలిసిందే. ఈ కేసులో దేవినేని అవినాశ్ ముందస్తు బెయిల్ పిటిషన్ పై నేడు విచారణ చేపట్టిన ఏపీ హైకోర్టు... ప్రభుత్వ వాదనలు వినడం కోసం తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది. ఈ కేసులో నేడు మరి కొన్ని ఆసక్తికర పరిణామాలు కూడా చేసుకున్నాయి. ముందస్తు బెయిల్ కోరుతూ ఏపీ ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కూడా ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై హైకోర్టు రేపు విచారణ చేపట్టనుంది. ఇప్పటికే వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, జోగి రమేశ్ ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు.

## జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బొజ్జా దశరథరామిరెడ్డి.

### -రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై కలెక్టర్ కు వివరించిన బొజ్జా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 09:
రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ఆద్వర్యంలో సమితి కార్యవర్గ సభ్యులు జిల్లాకు నూతనంగా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన రాజకుమారి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి అంశాలతో పాటు ప్రధానంగా నంద్యాల జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, నీటి లభ్యతలపై కలెక్టర్ గారికి బొజ్జా వివరించారు. గోరుకల్లు రిజర్వాయర్ ప్రమాదపుటంచులలో వుందని కలెక్టరు కు తెలిపారు. జిల్లాలో అత్యంత పురాతనమైన కే సి కెనాల్ ఆయకట్టుకు ఏరోజు వరుకు నీటిని అందిస్తారో చెప్పలేని పరిస్థితి ఉండటంతో ఏ పంటలు వేసుకోవాలో, వేసిన పంటలకు నీరందుతుందో లేదో అన్న మనోవేదనతో రైతులు వ్యవసాయం కొనసాగిస్తున్నారని కలెక్టర్ కు వివరించారు. సాగునీటి జిల్లా సాగునీటి వనరులు, ప్రాజెక్టుల గురించి కలెక్టర్ బొజ్జాతో చర్చించారు. ఈ సందర్భంగా తాను రచించిన "నీటి అవగాహనే రాయలసీమకు రక్ష" పుస్తకాన్ని కలెక్టర్ కి బొజ్జా అందచేసారు. సాగునీటి అంశాలను తెలుసుకోవాలని వున్నా ప్రస్తుతం సమయం లేనందువలన త్వరలో మలి విడత భేటీలో సాగునీటి అంశాలను చర్చిద్దామని ఈ సందర్భంగా కలెక్టర్ బొజ్జాకు తెలిపారు. కలెక్టర్ తో భేటీ అనంతరం మీడియాతో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులపై కలెక్టర్ కి వివరించినపుడు వారి స్పందన బాగుందని, రాయలసీమ సాగునీటి అంశాలను తెలుసుకోవాలన్న తపన వారిలో వుండటం మాకు చాలా సంతోషాన్ని కలిగించిందని అన్నారు. నీటి అవగాహనే రాయలసీమకు రక్ష పుస్తకం పూర్తిగా చదివిన తరువాత మరొకసారి కూర్చుని సాగునీటి అంశాలను చర్చిద్దామన్న కలెక్టర్ కి ధన్యవాదాలు తెలుపుతున్నామని బొజ్జా అన్నారు. కలెక్టర్ గారిని కలిసిన బృందంలో సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, మహేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు వున్నారు.

# బీసీల పునాదుల నుండి ఉద్భవించిన పార్టీ తెలుగుదేశం పార్టీ.

### -తెలుగుదేశం పార్టీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యం.
### -ఏపీ బీసీ సంక్షేమ శాఖ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవితమ్మ.



ఆంధ్ర ప్రగతి, గొల్లపూడి, జూలై 09:
బడుగు, బలహీన వర్గాల పునాదుల నుంచి తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని, బీసీల సంక్షేమానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవితమ్మ పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడిలో ఉన్న బీసీ సంక్షేమ భవనాన్ని గౌరవ బీసీ సంక్షేమ శాఖ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవితమ్మ మంగళవారం పరిశీలించారు.
అనంతరం మంత్రి వర్యులు మీడియాతో మాట్లాడుతూ జనాభాలో 50% ఉన్న బీసీలకు ముందుగా ధన్యవాదములు తెలిపారు. బీసీలను ఓట్లబ్యాంకుగా మార్చుకుని అన్ని విధాలుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీసీలను అణచివేసిందన్నారు.
గత వైకాపా ప్రభుత్వం గొప్పల కోసమే కార్పొరేషన్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్పొరేషన్ల ఏర్పాటుతో ఒక్క బీసీ కూడా అభివృద్ధి చెందలేదన్నారు. బీసీలకు ఏ ప్రయోజనం లేదన్నారు. కార్పొరేషన్లకు నిధులు లేవన్నారు. కనీసం కుర్చీలు కూడా లేవన్నారు. విధులు కూడా లేవన్నారు.
గత ప్రభుత్వంలో వివిధ కార్పొరేషన్ చైర్మన్లు జీతాలు తీసుకొని వైకాపా కార్యకర్తల్లా పనిచేశారన్నారు. జనాభా లెక్కల ప్రకారం బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించి బీసీలకు పూర్వ వైభవం తెస్తామని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా తనకు పెద్ద కుటుంబాన్ని ఇచ్చారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ, ఎన్డీఏ మహాకూటమితోనే బీసీల అభ్యున్నతి సాధ్యమన్నారు. బీసీల జీవన ప్రమాణాలు పెంపొందిస్తామన్నారు.
ఈ సందర్భంగా మైలవరం నియోజకవర్గంలోని టీడీపీ బీసీ విభాగం నాయకులు మంత్రి సవితమ్మ ని కలిసి పలు సమస్యలను వివరించారు. బీసీ సామాజిక భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామని మంత్రి సవితమ్మ హామీ ఇచ్చారు. ఇప్పటికే ఎమ్మెల్యే కృష్ణప్రసాదు నియోజకవర్గంలో బీసీ సామాజిక భవనాల నిర్మాణాలకు నిధుల కేటాయింపు గురించి తమ దృష్టికి తెచ్చారని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి నూతనపాటి బాల కోటేశ్వరరావు (బాల), ఎన్డీఏ మహాకూటమి నాయకులు, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు కార్యాలయ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచండి

### -మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయండి. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



ఆంధ్ర ప్రగతి నంద్యాల, జులై 09:
ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు, విద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని ఛాంబర్ లో విద్యా వ్యవస్థ పనితీరుపై సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయులు సిలబస్ ను సకాలంలో పూర్తిచేసి మెరుగైన ఫలితాల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎలాంటి అలసత్వం లేకుండా మెనూ తప్పనిసరిగా పాటిస్తూ ఆహార పదార్థాలు విద్యార్థులకు ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో మెనూ ఛార్ట్ తప్పనిసరిగా ప్రదర్శించడంతో పాటు వంటగది పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులందరూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీసుకునేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో టాయిలెట్ సౌకర్యంతో పాటు త్రాగునీటి ఆర్.ఓ ప్లాంట్లు ఖచ్చితంగా వుండాలన్నారు. విద్యార్థులు పాఠశాల సమయంలో టాయిలెట్ కొరకు పాఠశాల ఆవరణ దాటి బయటకు వెళ్ళకూడదన్నారు. టాయిలెట్స్ లో రన్నింగ్ వాటర్ ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు సరైన రీతిలో టాయిలెట్ వినియోగం గురించి అవగాహన కలిగిస్తూ పాఠశాలల్లో స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. నాడు నేడు పనులకొరకు ఉపయోగిస్తున్న మెటీరియల్, కంకర, ఇటుకలు, రాళ్ళు వంటివి పాఠశాల ఆవరణలో చిందర వందరగా కనిపించకుండ చర్యలు తీసుకోవాలన్నారు. మెటీరియల్ తరగతి గదులలో నిల్వచేసి, పిల్లలను బయట కూర్చోబెట్టడం సరి కాదన్నారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు సరిపడే విధంగా గుడ్లు మరియూ చిక్కీల ఇండెంట్ ముందుగానే ఇవ్వాలన్నారు. పంపిణీ చేసిన స్టూడెంట్ కిట్స్ విద్యార్థులందరూ వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూనిఫామ్ ఇచ్చాక వారం రోజుల్లో కుట్టించుకుని పిల్లలు రెగ్యులర్ గా యూనిఫామ్ తో షూస్, బెల్ట్ తప్పనిసరిగా ధరించేలా తరగతి ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని పిల్లలకు అలవాటు చేయాలని కలెక్టర్ సూచించారు. పీఎం శ్రీ పాఠశాలల్లో పీఎం శ్రీ మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో డిఈఓ సుధాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష అధికారి లలిత, పంచాయతీరాజ్ డీఈ రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విధులలో నిబద్ధత పాటించి నాణ్యతతో పనులు చేయండి

### -జిల్లా కలెక్టర్ జి రాజకుమారి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 09:
కలెక్టరేట్ కార్యాలయంలోని అన్ని సెక్షన్ల ఉద్యోగులు, సిబ్బంది క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వహించి నాణ్యతతో పనులు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అన్ని సెక్షన్ల సూపరిండెంట్లు, ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ ఏ పద్మజ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి .రాజకుమారి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ సామాన్య ప్రజలకు సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. ఎవరెవరు ఏ ఏ విభాగాలలో పని చేస్తారో వివరాలు అడిగి తెలుసుకుంటూ సంబంధిత అంశాలలో దిశా నిర్దేశం చేశారు. ప్రధానంగా భూ సేకరణ విభాగము, లీగల్ సెల్, రెవెన్యూ అంశాలకు సంబంధించి డ్రాఫ్టింగ్ నిర్వహిస్తూ ప్రణాళిక బద్ధంగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం ఉద్యోగ సమస్యలను అడిగి తెలుసుకుంటూ పార్కింగ్ షెడ్డు, టాయిలెట్లు ఆర్ఓ ప్లాంట్లు, డైనింగ్ హాలు, పబ్లిక్ టాయిలెట్లు, ప్రధాన రహదారి నుండి రోడ్డు సౌకర్య ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు.

## జిల్లాలో నకిలీ విత్తనాలు పేదలకు ఇళ్ల స్థలాలపై దృష్టి సారించాలి.

### -నూతన జిల్లా కలెక్టర్ రాజకుమారి ని కలిసి న సిపిఐ జిల్లా బృందం.
### -జిల్లాలో ఉన్న సమస్యలపై దృష్టి చారించాలని వినతి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 09:
నంద్యాల జిల్లా నూతన కలెక్టర్ రాజకుమారిని కలిసిజిల్లాలో నకిలీ విత్తనాలు. అరులేనా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై దృష్టి చారించాలని పూల బోకే ఫోటో ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్. మోటారాముడు. నాగరాముడు. జిల్లా సమితి సభ్యులు. జి సోమన్న డి శ్రీనివాసులు ఆర్ సామేలు. జి. హరినాథ్. ఎన్న. భార్గవ్. సంజీవులు. ఆర్ మహేశ్వరమ్మ. తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ.. జిల్లాలో అధికారం అడ్డం పెట్టుకొని దేశవ్యాప్తంగా నకిలీ విత్తనాలను సరఫరా చేసి కోట్ల రూపాయలు అధిపతులు అయినారని గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో పేరిట పేదలకు ఇల్లు నిర్మించి ఇస్తామని హామీలు ఇచ్చిఅధికార పార్టీ నాయకుల అనుచరులకె స్థలాలను ఇవ్వడంజరిగిందని విమర్శించారు. జిల్లాలోరైతుల సమస్యలు. ప్రభుత్వ భూములను కబ్జా సమస్యలు రోడ్ల సమస్యలు లాంటి అనేకం ఉన్నాయని వాటిపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించే దిశలో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని పై నాయకులు తెలిపారు.

## కలెక్టర్ జి.రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపి డా. బైరెడ్డి శబరి



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 09:
నంద్యాల జిల్లా కలెక్టరేట్ లో మంగళవారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారిని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డా. బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిచారు. జిల్లా రైతులకు పంటలు సాగుచేసుకునేందుకు సాగునీరు అందించాలని, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సమస్య లేకుండా చూడాలని ఎంపి శబరి జిల్లా కలెక్టర్ రాజకుమారిని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలోఎంపి శబరి విలేకరులతో మాట్లాడుతూ గత ఇదేళ్ళ వైసీపీ పాలనలో జిల్లాలోని కేసి కెనాల్, తెలుగుగంగా, ఎస్ ఆర్ బి సి ఆయకట్టు రైతులకు సక్రమంగా సాగునీరు అందించక అనేక కష్టాలు పడ్డారని, పంటలు ఎండిపోయిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, రైతులకు సాగునీరు ఇవ్వలేం అంటూ అధికారుల ద్వారా రైతులకు నోటీసులు ఇచ్చిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కిందని శబరి విమర్శించారు. గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారుల సహాకారం ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## చిరుత పులి దాడిలో యువకుడికి స్వల్ప గాయాలు.

### -భయం గుప్పిట్లో మహానంది ప్రజలు





ఆంధ్ర ప్రగతి మహానంది జూలై 09:
మహానంది మండలంలోని గ్రామాల ప్రజలు గత నెల రోజులుగా చిరుత పేరు వింటే హడలిపోతున్న పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో గాని తెల్లవారుజామున గాని చిరుత పులి ఎక్కడ దాడి చేస్తిందో అని, గ్రామస్తులు బిక్కుబిక్కుమంటు జీవనం సాగిస్తున్న పరిస్థితి. చిరుత పులి దాడిలో యువకుడికి స్వల్ప గాయాలైన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మహానందిలోని ఈశ్వర్ నగర్ కాలనీ సమీపంలోని, చెంచు గూడానికి చెందిన నాగన్న అనే యువకుడు బహిర్భూమికి వెళ్ళగా, వెనుక వైపు నుంచి చిరుత పులి దాడి చేసిందని తెలిపారు. వెంటనే నాగన్న అప్రమత్తమై,భయపడి కేకలు వేయడంతో పారిపోయిందని తెలిపారు. దీంతో చెంచు గూడెంలోని ప్రజలు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. అటవీ శాఖ అధికారులు ఎవరికో ఒకరికి ప్రాణ నష్టం జరిగితే గాని స్పందించరా, అని ప్రజలు వాపోతున్నారు. చిరుత సంచారంతో ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. ఫారెస్ట్ అధికారులు పులిని బంధించడంలో అలసత్వం ఎందుకు వహిస్తున్నారో, అని అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ ఉన్నత అధికారులు స్పందించి, చిరుత పులిని బంధించాలని కోరుతున్నారు.